క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీతారత్నం

జలుమూరు: పౌష్టికాహారంతోనే తల్లీపిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సారవకోట ప్రాజెక్టు పర్యవేక్షకులు సీతారత్నం అన్నారు. శ్రీముఖలింగంలో గురువారం ఏర్పాటు చేసిన పోషకాహార మాసోత్సవాలలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెలవారీ వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా రక్తహీనత అధిగమించవచ్చన్నారు.

సామాజిక తనిఖీలు సక్రమంగా చేపట్టాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు

సరుబుజ్జిలి: ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు తెలిపారు. సామాజిక తనిఖీలకు సంబంధించి సమన్వయ సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఉపాధి సిబ్బంది పనుల రికార్డులు సోషల్ ఆడిట్ బృందాల సభ్యులకు వెంటనే అప్పగించాలని ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్, ఏపీఓ బొత్స పార్వతి, ఎస్‌ఆర్పీ, డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త చలపతిరావు

బూర్జ: పంటలలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని పెద్దపేట వైఎస్సార్ హార్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.బి.వి.చలపతిరావు అన్నారు. మండలంలోని పాలవలసలో మన గ్రామం- మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. చీడపీడల నివారణ, తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. జీవనియంత్రణ పద్ధతుల్లో భాగంగా మిత్ర పురుగులకు తోటల్లో విడిచి పెట్టడం వల్ల చీడపీడలు నివారించుకోవచ్చునన్నారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు కావాలని ఏఓ ఎం.మోహన్‌రావు తెలిపారు. మండలంలో రామచంద్రాపురం, చిట్టివలస, జొన్నవలస గ్రామాలలోని పంట పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర రావాలంటే ఈకేవైసీ ద్వారా పంట అమ్మకాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం వరి పంటకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల వరిపంటకు తెగుళ్ల సోకుతున్నాయని, వాటి నివారణకు వ్యవసాయశాఖ సిబ్బంది సూచించిన మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. వరి పంటలను రైతులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట ఈనిక, పాలు పోసుకునే దశలో ఉందని పొటాష్ వేయాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ఇంటింటా సర్వే



పొన్నాంపేటలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

ఆమదాలవలస రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయని అక్కులపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.మీనాకుమారి, బి.వసంతకుమారి అన్నారు. మండలంలో పొన్నాంపేట, చెవ్వాకులపేట గ్రామాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టారు. కుటుంబంలో ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సర్వేలో భాగంగా బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలను నిర్వహించి వ్యాధుల తీవ్రత ఉంటే వైద్య శిబిరంలో తదుపరి సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ సర్వేలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురజాడ రచనలు ఆదర్శం

● ఘనంగా మహాకవి జయంతి



నరసన్నపేట: మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: మహాకవి గురజాడ రచనలు నేటి తరానికి ఆదర్శమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. గురజాడ అప్పారావు జయంతిని గురువారం కళాశాలలో నిర్వహించారు. గురజాడ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన మహాకవి గురజాడ అని అన్నారు. ఆయన రచనలు అన్నీ ఆదర్శమన్నారు. విద్యార్థులు గురజాడ రచనలు చదవాలన్నారు. తెలుగుకు ఎంతో కీర్తి తెచ్చిన కవుల్లో గురజాడ ఒకరన్నారు. ఈ కార్యక్రమలో తెలుగు విభాగం అధ్యాపకుడు జి.రవికుమార్, ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు పి.అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: గురజాడ జయంతి పురస్కరించుకుని మండలంలోని జేబీటీ పాఠశాల విద్యార్థులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గురజాడ తన రచనల ద్వారా సమాజంలో తీసుకుచ్చిన మార్పులు గూర్చి పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ విద్యార్థులకు వివరించారు.



సారవకోట: జేబీటీ పాఠశాలలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



పాతపట్నం: గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం వైకుంఠరావు, ఉపాధ్యాయులు

పాతపట్నంలో..

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు మాట్లాడుతూ వ్యవహారిక భాషలో అనేక రచనలు రాశారని, సాంఘిక పరివర్తనకు కృషి చేశారన్నారు. కన్యాశుల్కం రచనలతో స్త్రీ విలువలను తెలిజేశారన్నారు. గురజాడ రచనలను జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎన్.తారకరామారావు తెలియజేశారు. గురజాడ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



బూర్జ: పెద్దపేటలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్న యువకులు

బూర్జ: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా మండలంలోని పెద్దపేట గ్రామంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గ నిర్వహించారు.ప్రతీ గ్రామంలో ఆయాగ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.అనంతరం పాలకొండ సత్య సాయి సేవా సమితి అధ్యక్షులు ఎస్ వి రమణ అధ్వర్యంలో భజనలు, భక్తి పాటలుతో వినాయకుని విశిష్టతను వివరించారు.



ఆమదాలవలస: కాలేజీ రోడ్డులో ఏర్పాటు చేసిన అన్నదానం

కాలేజీ వీధిలో..

ఆమదాలవలస: వినాకయచవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆమదాలవలస పట్టణంలో కాలేజీ వీధి వద్ద ప్రధాన రహదారిపై అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

రైల్వేస్టేషన్ ఆవరణలో..

ఆమదాలవలస రైల్వే స్టేషన్ ఆవరణలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ త్రిరాత్రి మహోత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయండి

నరసన్నపేట: యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏడాది పాటు నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాల్లో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవల్లో భాగంగా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జీపు జాతా నరసన్నపేటకు గురువారం సాయంత్రం చేరుకుంది. ఈ సందర్భంగా పైడితల్లి కూడలి వద్ద జీపు జాతాకు స్థానిక ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం యూటీఎఫ్ పతాకాన్ని పైడితల్లి కూడలిలో ఆవిష్కరించారు. కామేశ్వరరావు మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా యూటీఎఫ్ పనిచేస్తుందన్నారు. ఈ సంఘాన్ని మరింతగా ఆదరించాలని, ఏడాది పొడుగునా నిర్వహించనున్న స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. అక్టోబర్ ఒకటిన విజయవాడ సిద్ధార్థ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎన్.కుమార్ రాజా, చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్. కిశోర్ కుమార్, స్థానిక ప్రతినిధులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, కోరాడ వైకుంఠరావు, ధనలక్ష్మి, వై.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మహిళా రిజర్వేషన్ అభినందనీయం

ఎల్.ఎన్.పేట: మహిళా బిల్లుకు కేంద్ర కాబినేట్ ఆమోదం తెలపడం మంచితరుమణి ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటినుంచి మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం కల్పించేలా 33 శాతం రిజర్వేషన్ ఆమోదించటం సంతోషకరమన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం జగన్ నిరంతరం మహిళా సంక్షేమం కోసం అలోచన చేయటం గొప్ప విషయమన్నారు. చట్ట సభల్లో, రాజ్యాధికారంలో మహిళలకు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కల్పించటం శుభపరిణామమన్నారు.



ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి

చురుగ్గా ఆధార్ అప్‌డేట్

నరసన్నపేట: మండలంలోని కరగాం, గోపాలపెంటతో పలు సచివాలయాల్లో ఆధార్ సీడింగ్ చురుగ్గా జరుగుతుందని ఎంపీడీఓ బి.మధుసూదనరావు గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి సచివాలయాల వారీగా ఆధార్ అప్‌డేట్ చేపడుతున్నామన్నారు. ఆధార్ కార్డు వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి మార్పులు, చేర్పులు చేయని వారు విధిగా ఆధార్ కేంద్రాల వద్దకు వెళ్లి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. దీంట్లో భాగంగా మండలంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శుక్ర, శని వారాల్లో కూడా ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



కరగాం సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ నిర్వహిస్తున్న దృశ్యం

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రభుత్వ స్థలాలు, రోడ్డు పక్కన, చెరువులు, కాలువ గట్లుపై మొక్కలు పెంచేందుకు దృష్టి సారించాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ వి శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొక్కల పెంపకంపై నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. వర్షం నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్లక్ష్యంగా పనిచేసే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీదేవి

శ్రీరామేశ్వరి కళాశాలలో దూరవిద్యా కేంద్రం

హిరమండలం: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రాన్ని హిరమండలం శ్రీరామేశ్వరి డిగ్రీ కళాశాలకు మంజూరు చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ రెడ్డి గోపాలరావు గురువారం తెలిపారు. దూరవిద్యా కేంద్రం మంజూరుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఏఎన్‌యూ దూరవిద్యా విభాగం సంచాలకుల నుంచి అందిందన్నారు. దూరవిద్యలో బీఏ, బీకాం, బీబీఏ, ఎంఏ, ఎంకాం, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

రేషన్ కార్డులో పేరు తొలగింపుపై ఫిర్యాదు

సారవకోట: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన పొన్నాన గణపతిరావు పేరును రేషన్ కార్డు నుంచి తొలగించి జమచక్రం పంచాయతీ రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఓ కార్డులో చేర్పించారని తండ్రి మాధవరావు గురువారం తహసీల్దార్ హనుమంతరావు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడికి రేషన్ రావడం లేదని, అమ్మఒడి కూడా మంజూరు కావడం లేదన్నారు. తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రమేయంతోనే ఇలా జరిగిందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి పట్ల సంతాపం



రెడ్డి రాజు (ఫైల్)

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి రాజు (44) విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన భార్య అపర్ణ ఎంపీటీసీ (సోభ)గా ఉన్నారు. రాజు మృతి పట్ల ఎమ్మెల్యే రెడ్డి శాంతి సంతాపం తెలియజేశారు. పార్టీకి తీరనిలోటు అని, పార్టీ ప్రారంభం నుంచి ఆయన సేవలు అందించారన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఘనంగా విశ్వకర్మ విగ్రహ నిమజ్జనం



విశ్వకర్మ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామంలో గురువారం భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ విగ్రహ నిమజ్జనోత్సవం నిర్వహించారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు చేపట్టారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కొత్తూరు: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు వి.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన జీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ చక్రవర్తికి అందజేశారు. పీఆర్టీయూ నాయకులు వి.ప్రసాదరావు, రుషి, జి.శివకృష్ణ, ఎన్‌జీఓ కొత్తూరు తాలూకా అధ్యక్షుడు అల్లు తిరుపతిరావు మిన్నారావు, రాజగోపాలరావు, ఏపీటీఎఫ్ నాయకులు వై.సత్యనారాయణ, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొత్తూరు: మండలంలోని దిమిలి కూడలి వద్ద గురువారం ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక ఎస్ఐ ఎం.ఎ.ఆహమ్మద్ పట్టుకున్నారు. పొనుటూరు సమీపంలోని వంశధార నది నుంచి దిమిలికి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు ఎస్ఐకి సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫాతో ఆర్థిక భరోసా

● అసెంబ్లీలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: పేద కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కల్యాణమస్తు.. వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రెడ్డి శాంతి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవ ప్రదంగా జరిపించేలా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులకు ఈ ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. వైఎస్సార్ షాదీ తోఫా ముస్లిం మైనార్టీ వర్గాల వారికి అండగా ఉంటుందన్నారు. ఈ పథకాలు పొందాలంటే ఆడపిల్ల కనీసం 10వ తరగతి వరకు చదువుకోవాలన్నారు. 18 ఏళ్ల వయసు దాటిన వారికే ఈ పథకం వర్తింపజేయటంతో బాల్యవివాహాలు తగ్గుతున్నాయన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు.. షాదీ తోఫా పథకంలో భాగంగా పాతపట్నం నియోజకవర్గంలో మొదటి విడతలో 14 మందికి, 2వ విడతలో 92 మందికి, మూడో విడతలో 177 మందికి రూ.1.80 కోట్లు నిధులు విడుదల చేయటం జరిగిందన్నారు. సీఎం జగన్ అమలు చేసిన పథకాలను ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నరసన్నపేట: విద్యార్థులతోపాటు ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటురోగాల నుంచి బయటపడవచ్చని ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి అన్నారు. జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆదేశాల మేరకు ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఓడీఎస్, చేతుల పరిశుభ్రం, తడి, పొడి చెత్త సేకరణ తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎవరి ఇంటి పరిసరాలు వారు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు. విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన ఉండాలన్నారు. హెచ్‌ఎం హర్షవర్ధన్ శర్మ, గ్రామీణ రక్షిత నీటి విభాగం ప్రతినిధి కె.అన్నాజీరావు, ఎస్.మురళీమోహన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉర్లాంలో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

26 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

హిరమండలం: ఈ నెల 26 నుంచి జరగనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సమర్థవంతగా నిర్వహించాలని ఎంఈఓ కె.రాంబాబు, టి.షణ్ముఖరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ఆరు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలు రాష్ట్ర విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. సమావేశాల నిర్వాహణ తీరును పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికార బృందాలు రానున్నట్లు తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు టి.కేశవరావు, ఎస్.దాలయ్య, బి.గొల్లవాడు, ఆర్.పూర్ణచంద్రరావు, పి.రాజారావు, సీఆర్పీ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓలు రాంబాబు, షణ్ముఖరావు

స్కూల్ గేమ్స్ ఏర్పాట్ల పరిశీలన

పాతపట్నం: నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్‌లు నియోజకవర్గ స్థాయి అండర్ 14, 17 విభాగాల్లో ఎంపికలు ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహించనున్నామని పీడీ వై.శేఖర్‌బాబు తెలిపారు. గురువారం ప్రభుత్వ మోడల్ స్కూల్ పక్కన ఉన్న మినీస్టేడియంలో క్రీడా కోర్టులను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చనున్నారని పీడీ తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీడీ, ప్రిన్సిపాల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మండలంలోని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గొర్లె తిరుమలరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ విభాగం నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో మొక్కలు నాటారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్ కోఆర్డినేటర్ తూతిక సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ అడవులను కాపాడుకున్నప్పుడే పర్యావరణానికి ఎటవంటి ముప్పు ఉండదన్నారు. అలాగే గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు టి.తిరుమలరావు, వెంకటభాస్కరరావు, జన్ని చిన్నయ్య పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

భక్తిశ్రద్ధలతో లలితా సహస్ర పారాయణం

నరసన్నపేట: వినాయక నవరాత్రుల్లో భాగంగా స్థానిక శ్రీరామ నగర్‌లోని విగ్రహం వద్ద మహిళలు గురువారం వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు. లలితా సహస్ర నామ పారాయణం చేపట్టారు. 36 మంది మహిళలు దీంట్లో పాల్గొన్నారు. నాయుడు వీధి-కొత్తవీధిలో వినాయక విగ్రహం వద్ద భక్తులు పుష్పాభిషేకం నిర్వహించారు. విశ్రాంత ఆర్డీఓ పీరు ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



లలిత సహస్ర పారాయణంలో పాల్గొన్న మహిళలు

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

నరసన్నపేట: వరిలో అధిక దిగుబడులు సాధించాలంటే యాజమాన్య పద్ధతులు ప్రధానమని జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షుడు శిమ్మ నేతాజీ అన్నారు. మండలంలోని కిళ్లాంలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీంట్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విత్తనాల ఎంపిక నుంచి ఉభాలు, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించాలన్నారు. అప్పుడే ఆశించిన దిగుబడులు వస్తాయని తెలిపారు. వ్యవసాయాధికారి కె.సునీత మాట్లాడుతూ వరిలో శత్రు పరుగులతో పాటు మిత్ర పురుగులు ఉంటాయని, వీటిని రైతులు కాపాడుకుంటే వరి పైర్లును ధ్వంసం చేసే పురుగులను అరికట్టవచ్చన్నారు. ఇష్టానుసారంగా క్రిమిసంహారిక మందులు వాడడం ద్వారా మిత్ర పురుగులు మరణిస్తున్నాయన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం వరి పైర్లుపై తెగుళ్లు ఆశిస్తున్నాయని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. ఏఈఓ అమరావతి పాల్గొన్నారు.